GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

GSTIN-NO : 36FKPSI308PIZX
Cell : 8919710365
టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
epaper:tmedia.net.in YouTube
టి మీడియా ఆన్లైన్ సర్వీస్ & న్యూస్ ఏజెన్సీ
మీరు ఉన్న దగ్గర నుండే సేవలకోసం కాల్ చేయండి : 8500515365
➤ కేంద్రం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ, స్వదేశీ విద్య కోసం ఇచ్చే ఆర్థిక సహాయాల దరఖాస్తులు ప్రాసెసింగ్
➤ ఎమ్మెల్సీ ఓటు, జనరల్ ఓటు నమోదు కోసం
➤ లేబర్ డిపార్ట్మెంట్ లైసెన్స్ అప్లికేషన్ ప్రాసెసింగ్
➤ కేంద్ర ప్రభుత్వ నిబంధనలతో డిజిటల్ మీడియా నిర్వహణ కోసం
➤ ప్రభుత్వ పథకాలు ఇతర కాంపిటేటివ్ పరీక్షల దరఖాస్తులు ప్రాసెసింగ్ తదితర ఆన్లైన్ సర్వీస్‌లు

సంపుటి : 6 | సంచిక : 195 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం : ఫిబ్రవరి 29-2024 | పేజీలు : 3





# పాత రహదారి నిర్మాణానికి పాతర

- కొత్త రూట్ మ్యాప్ హైవే
- రోడ్డెక్కుతున్నరైతులు
- వరుస నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు

**టీ మీడియా, ఫిబ్రవరి 28, మంచిర్యాలబ్యూరో :** నేషనల్ హైవే 63 నిర్మాణం మంచిర్యాల జిల్లాలో మంటలు రేపుతోంది. జాతీయ రహదారి 63 నిర్మాణంలో మార్పులను వ్యతిరేకిస్తూ మంచిర్యాల జిల్లా బాధితులు పెద్ద ఎత్తున రోడ్డెక్కుతున్నారు. పాత రహదారి నిర్మాణానికి పాతరేసి గ్రీన్ ఫీల్ట్ హైవే అంటూ కొత్త రూట్ మ్యాప్?తో మా బ్రతుకులను రోడ్డు పాలు చేస్తున్నారంటూ ఆగ్రహిస్తూ 3 మండలాల రైతులు ఆందోళన బాట పట్టారు. గ్రీన్ ఫీల్ హైవే వద్దు పాత రహదారే ముద్దు అంటూ వరుస నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నారు. గ్రీన్ ఫీల్ట్ రహదారంటూ పచ్చని పంటపొలాలను మింగేస్తున్న ఎన్ హెచ్ 63 రహదారి మాకు వద్దే వద్దంటూ ముక్తకంఠంతో నినదిస్తున్నారు 30 గ్రామాల ప్రజలు. పంట భూములు కోల్పోతున్నాం న్యాయం చేయాలంటూ వేడుకుంటున్న ఎన్ హెచ్ 63 బాధిత రైతుల ఆవేదనపై టీవీ9 గ్రౌండ్ రిపోర్ట్.జాతీయ రహదారి 63 కథ మళ్లీ మొదటికొచ్చింది. గ్రీన్ ఫీల్డ్ హైవే కారణంగా వందల ఎకరాల పచ్చని పంటలు కోల్పోతున్నామంటూ రైతులు ఆందోళనకు దిగడంతో ఎన్ హెచ్ హైవే 63 సర్వే తాత్కాలికంగా నిలిచిపోయింది. నిజామాబాద్ నుండి జగ్దెల్?పూర్?లో మూడు రాష్ట్రాలను కలుపుతూ సాగనున్న ఈ రహదారి ప్యాకేజీ 4లో భాగంగా ఆర్మూరు-మంచిర్యాల మధ్య 4 వరసలు రహదారి సర్వే మళ్లీ నిలిచిపోయింది. 131.8 కి.మీ. మేర నిర్మించే నాలుగు వరసల రహదారిలో 100 కిమీల బైపాస్ లు 46 వంతెనలతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు మూడు సార్లు రూట్లు మారి ఎట్టకేలకు యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిగా తెరపైకి వచ్చింది. అయితే ఈ రహదారిలోని ప్యాకేజీ 4 లో జగిత్యాల జిల్లా రాయపట్నం గోదావరి వంతెన నుండి మొదలై.. మంచిర్యాల జిల్లా ముల్కల వరకు 34 కిమీ మేర నిర్మాణం కానున్న యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ పీల్డ్ హైవే మాకొద్దంటూ రైతులు ఆందోళన చేయడంతో హైవే కథ మళ్లీ మొదటికొచ్చింది.నిజామాబాద్ %--% జగిత్యాల %--% మంచిర్యాల జిల్లాల మధ్య మూడేళ్ల క్రితం ప్రపోజ్ చేసిన గ్రీన్ ఫీల్డ్ హైవేకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నేషనల్ హైవే 63 లో భాగంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా గద్దెరాగడి వరకు దీనిని నిర్మించేందుకు ఓకే చెప్పింది. 125 కిలోమీటర్ల పొడవైన ఈ ఫోర్ లేన్ కోసం మొదట రూ.2,591 కోట్లు కేటాయించగా.. అంచనా వ్యయం మూడేళ్లలో అమాంతం పెరిగి రూ.3,850 కోట్లు ఖర్చుకు చేరింది. నాలుగు ప్యాకేజీలుగా నిర్మాణం కానున్న ఈ రహదారి ప్యాకేజీ1లో భాగంగా ఆర్మూరు నుంచి మెట్‌పల్లి వరకు 35.9 కి.మీ.. ప్యాకేజీ2 లో మెట్‌పల్లి నుంచి జగిత్యాల వరకు 28.7 కి.మీ.. ప్యాకేజీ3 జగిత్యాల నుంచి రాయపట్నం వరకు 31.9 కి.మీల రహదారి సర్వే పూర్తయి నిర్మాణం కూడా కొనసాగుతుండగా అసలు చిక్కల్లా ప్యాకేజీ4 లోని జగిత్యాలజిల్లా రాయపట్నం నుంచి మంచిర్యాల జిల్లా ముల్కల వరకు నిర్మాణం కానున్న 35.9 కి.మీ లోని వచ్చిపడింది. ఈ 35 కిమీల లో ఏకంగా 213 మంది రైతులకు చెందిన 105 హెక్టార్ల భూమిని ఎన్ హెచ్ హైవేలో 63లో కనుమరుగుకానుంది. అయితే గతంలో ఇదే 35కిమీల లో 22 కిమీల రహదారిని బ్రౌన్ ఫీల్డ్ గా మారుస్తూ సర్వే నిర్వహించింది కేంద్రం. అయితే ఈ బ్రౌన్ పీల్డ్ రహదారితో లక్షెట్టిపేట మున్సిపాలిటీ ప్రమాదంలో పడనుందని.. 30 గ్రామాల ప్రజలు రోడ్డెక్కడంతో సర్వే నిలిచిపోయింది. గల్లీ నుండి ఢిల్లీ వరకు బాధితులు తమ వాయిస్ వినిపించడంతో రాత్రికి రాత్రే బ్రౌన్ ఫీల్డ్ రద్దైంది. తాజాగా యాక్సెస్ గ్రీన్ ఫీల్డ్ అంటూ కేంద్ర కొత్త పేరుతో ఎన్ హెచ్ హైవే 63 ప్యాకేజీ 4 సర్వేకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పచ్చని పంట పొలాలు జాతీయ రహదారి పాపాన కోల్పోతున్నామంటూ రోడ్డెక్కారు 20 గ్రామాలకు చెందిన 210 మంది రైతులు.ఏళ్లుగా ఎదురుచూస్తున్న జాతీయ రహదారి 63 విస్తరణకు మోక్షం లభించిందని సంతోషించేలోపే.. రహదారి రూట్?నే మార్చి తమను నిండా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు బాధిత రైతులు. ముందుగా గ్రీన్ ఫీల్డ్ హైవే అని ఆ తర్వాత బ్రౌన్ ఫీల్డ్ అని తాజాగా యాక్సెస్ గ్రీన్ ఫీల్డ్ అని హైవే అంటూ పూటకో పేరుమారుస్తూ తమ బతుకులు రోడ్డు పాలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు 22 గ్రామాల రైతులు. భూసేకరణలో మంచిర్యాల జిల్లాలోని ప్యాకేజీ 4 లో 113 హెక్టర్ల భూమి గుర్తించిన అధికారులు సర్వేలు సిద్ధమవగా ప్రాణాలైన వదులుకుంటాం కానీ తమ భూములు వదులుకోమంటూ ఆందోళనకు దిగింది బాదిత రైతాంగం.గ్రీన్ పీల్డ్ హైవే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మోర్తాడ్, కమ్మరిపల్లి, జగిత్యాల, ధర్మపురి, రాయపట్నం, లక్సెట్టిపేట మీదుగా మంచిర్యాల వరకు నాలుగు వరుసల రోడ్డును విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఆమోద ముద్ర వేసింది. లక్షెట్టిపేట , క్యాతనపల్లి మున్సిపాలిటీల ను సేవ్ చేస్తూ.. మున్సిపాలిటీల శివారు ప్రాంతాల నుండి ఎంటరై ముందుకెళ్లేది.. అయితే మంచిర్యాలలోని కొందరు బడా వ్యాపారులు చక్రం తప్పడంతో ముల్కాల శివార్?లోని రాళ్లవాగుపై నుంచి ఆర్ఆర్ నగర్, అమ్మ గార్డెన్స్, ఎంఎస్ఆర్ గార్డెన్స్ ఏరియాలోని రియల్ వెంచర్ల మీదుగా వెళ్లి.. గద్దెరాగడి వద్ద ఎన్ హెచ్ 363కి కలవాల్సిన రోడ్డు నేరుగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎంట్రీ కానుంది. దీనికి సంబంధించి రూపొందించిన అలైన్ మెంట్ కు ఎన్ హెచ్ఎఐ ఆమోదం తెలిపింది. దీంతో మంచిర్యాల, క్యాతన్ పల్లి మున్సిపాలిటీల పరిధిలో కొత్తగా వెలుస్తున్న కాలనీలు, రియల్ వెంచర్లు సేప్ జోన్ లోకి వెళ్లి మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట , మోదెల , పోతపల్లి, ఇటిక్యాల , గూడెం , ముల్కాల రైతులు తీవ్రంగా నష్టపోనున్నాయి.

# వైసీపీ..టీడీపీ మధ్య హంద్రీనీ'వార్

## పేలుతున్న మాటల తూటాలు



**టి మీడియా, ఫిబ్రవరి 28,కుప్పం :** కుప్పంలో హంద్రీనీవా రాజకీయం వేడెక్కింది. కుప్పంకు నీళ్లు ఇచ్చిన క్రెడిట్ తమదేనంటున్న వైసీపీ, తెలుగుదేశం పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కృష్ణా జలాలను కుప్పంనకు తీసుకొచ్చింది జగన్ అని వైసీపీ, 90 శాతం పనులు పూర్తి చేసింది చంద్రబాబేనంటున్న టీడీపీ ఇలా అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య వార్ పీక్స్‌కు చేరింది. హంద్రీ నీవా నీళు మంటలుగా మారడంతో కుప్పం వాటర్ పాలిటిక్స్ కు వేదికైంది.తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం పాలిటిక్స్ సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యటన తర్వాత మరింత హీట్‌గా మారాయి. హంద్రీనీవా నీటి వ్యవహారం టీడీపీ %--% వైసీపీలకు రాజకీయ ఆయుధంగా మారింది. కుప్పంకు నీళ్లు ఇచ్చిన క్రెడిట్ తమదేనంటున్న వైసీపీ, వైసీపీ ది షోఅప్ అంటున్న టీడీపీ. ఇలా రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తాజాగా కుప్పంలో పర్యటించిన సీఎం హంద్రీనీవా నీటిని కుప్పంకు అందించడంతో హంద్రీనీవా ఇష్యు హాట్ టాపిక్ గా మారిపోయింది.672 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం నుంచి కృష్ణమ్మను కుప్పంకు తీసుకొచ్చామన్నారు సీఎం వైఎస్ జగన్. కుప్పంకు నీళు ఇచ్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా మన్నారు. 35 ఏళ్లుగా ఎమ్మెల్యేగా మూడు సార్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎందుకు కుప్పంకు నీళ్లు తీసుకుని రాలేదని ప్రశ్నించడంతో ఇష్యు పొలిటికల్ టర్న్ తీసుకుంది. ఇది చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన సందర్భమన్న సీఎం ఎంతో గర్వపడుతున్నా నన్నారు. లాభాలు ఉన్న పనులే చంద్రబాబు చేశారని ఇది వరకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానన్నారు. మరో రెండు రిజర్వాయర్ల నిర్మాణంకు శ్రీకారం చుట్టామని సీఎం జగన్ తెలిపారు..కుప్పంలో ఒక టిఎంసి సామర్థ్యంతో రెండు రిజర్వాయర్లను రూ. 535 కోట్ల రూపాయలతో నిర్మిస్తామన్నారు. అదనంగా మరో 5 వేల ఎకరాలకు సాగు నీరు లభిస్తుందని, 35 ఏళ్లుగా ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా, మూడు సార్లు సీఎంగా ఎన్నికైన చంద్రబాబు ఎందుకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తి చేయలేక పోయారని సీఎం ప్రశ్నించారు. కుప్పంకే ప్రయోజనం లేని నాయకుడు వల్ల రాష్ట్రానికి ఏమి ప్రయోజనం జరుగుతుందన్న సీఎం. తనకు భారీ వాటాలు ఇచ్చే వారికే ఈ ప్రాజెక్ట్ పనులు ఇవ్వాలని చంద్రబాబు ఆలోచన చేశాడన్నారు. ఎంతో చిత్తశుద్ధితో ఈ పనులు మేము పూర్తి చేశామన్నారు సీఎం జగన్.ఇక కుప్పంలో సీఎం జగన్ వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ కౌంటర్ అటాక్ ఇస్తోంది. కుప్పంకు హంద్రీనీవా క్రెడిట్ తమాడేనంటున్న వైసీపీపై మండిపడుతోంది. కుప్పంకు హంద్రీనీవా జలాలు నేనే తెచ్చా అంటూ ప్రజలకు బూటకపు మాటలతో మోసం చేయవద్దని సీఎంకు కౌంటర్ ఇచ్చారు టీడీపీ నేతలు. టీడీపీ ప్రభుత్వంలో వందల కిలోమీటర్లు కాలువ తవ్వి కుప్పంకు జల నిధిని అందించే ప్రయత్నం చంద్రబాబు చేశారన్నారు. వైసీపీ 5 ఏళ్ల పాలనలో 30 కిలోమీటర్లు కూడా కాలువ తవ్వలేక పోయారని ఆరోపించారు టీడీపీ మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి.పోలవరం ప్రాజెక్టును విస్మరించి కుప్పంకు నీళ్లు తీసుకురావడం సాధ్యమా అని ప్రశ్నించిన అమర్ ఎన్నికలు దగ్గరవుతున్న వేళ మాటల గారడీ చెయ్యొద్దన్నారు. జగన్ రెడ్డి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కుప్పం అభివృద్ధి పేపర్ ప్రకటనకే పరిమితం అయ్యిందన్నారు. సీఎంగా చంద్రబాబు పులివెందులకు సైతం నీళ్ళు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకున్నారని గుర్తు చేశారు. ఇరిగేషన్ శాఖపై అవగాహన లేక ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారన్నా మాజీ మంత్రి అమ..ర్ వైఫల్యాలను జనం మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్లపాటు రివర్స్ గేర్ లో నడిచిన వైసీపీ సర్కార్ పర్యవసానంగా జగన్ కు రిటర్న్ గిఫ్ట్ కు కుప్పం ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు.

## మార్చి ఒకటిన ప్రత్యేక హెూదాపై

# డిక్లరేషన్ చేయబోతున్నాం

### ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**టీ మీడియా, ఫిబ్రవరి 28, విజయవాడ:** మార్చి ఒకటిన తిరుపతిలో జరిగే సభలో ప్రత్యేక హెూదాపై డిక్లరేషన్ చేయబోతున్నామని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ " అభివృద్ధిలో కూడా కాంగ్రెస్ పార్టీ ముందుంటుంది. మార్చి ఒకటిన తిరుపతిలో జరిగే సభలో ప్రత్యేక హెూదాపై డిక్లరేషన్ చేయబోతున్నాం. హెూదా అవసరం గురించి అందరికీ తెలిసినా ఏపీలో ప్రధాన రాజకీయ పార్టీలు మాట్లాడవు. గత ఎన్నికలలో హెూదాను రాజకీయ ప్రచారం చేసుకున్నారు. లబ్ది పొంది అధికారంలోకి వచ్చాక పోరాటం చేయడం మరిచారు. ఏపీకి ప్రత్యేక హెూదా వల్ల కలిగే ఉపయోగం అందరికీ తెలుసు. మోడీ మాట ఇచ్చిన తిరుపతిలో అదే మైదానంలో హెూదాపై కాంగ్రెస్ డిక్లరేషన్ చేస్తుంది. పదేళ్లు హెూదా కావాలని నాడు బీజేపీ కోరింది వాస్తవం కాదా. ఆ తరువాత ఎన్నికల్లో ఏపీకి ఎన్నో హామీలు ఇచ్చారు. హెూదా లేదు, విభజన చట్టంలోని అంశాలను కూడా మరిచారు. అన్నీ అమలు చేశామని బీజేపీ ప్రచారం చేసుకుంటుంది" అని అన్నారు.

# హెచ్‌ఎండీఏలో విజిలెన్స్ సోదాలు

మరోవైపు
సీఎం
రేవంత్‌రెడ్డి సమీక్ష
చెరువుల డాటా
ఆన్‌లైన్‌లో ఉండాలని
ఆదేశాలు




**టీ మీడియా, ఫిబ్రవరి 28 హైదరాబాద్:** హెచ్ ఎండీఏలో విజిలెన్స్ సోదాలు కలకలం రేపుతున్నాయి. హెచ్ఎండీఏ కార్యాలయంలో బుధవారం ఉదయం నుంచి విజిలెన్స్ సోదాలు కొనసాగుతున్నాయి. 50 మంది స్పెషల్ టీమ్‌తో సోదాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చిన ఫైల్స్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మైత్రీవనం నాలుగో అంతస్తులో ఉన్న అన్ని ఫైల్స్‌ను విజిలెన్స్ సీజ్ చేసింది. అంతేకాకుండా.. స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని ఏడో అంతస్తులో కూడా తనిఖీలు చేస్తున్నారు. అరెస్ట్ వారెంట్‌తో వెళ్లిన విజిలెన్స్ నిఘా టీం.. హెచ్ఎండీఏ ఇద్దరు డైరెక్టర్లు గతంలో అనుమతించిన ఫైల్స్‌పై ఆరా తీశారు.ఆన్‌లైన్ డేటా నుంచి చెరువులు మాయంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. నాలుగు రోజుల క్రితమే దాడులు జరుగుతాయని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులను ముందే హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3,500 చెరువుల డాటా ఆన్‌లైన్‌లో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే చెరువుల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలకు రంగం సిద్ధమైంది. అక్రమ లే-అవుట్, బిల్డింగ్ అనుమతులపై దర్యాప్తు చేస్తున్నారు.హెచ్ఎండీఏలో కొన్ని రోజుల క్రితం ఏసీబీ కూడా దాడులు నిర్వహించింది. అమీర్‌పేట్‌లోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో ఉన్న హెచ్ఎండీఏ కార్యాలయంలో వివిధ జోన్‌లకు చెందిన ఫైళ్లను తనిఖీ చేశారు. ఫైళ్లను పరిశీలించే క్రమంలో హెచ్ఎండీఏలోని ఘట్‌కేసర్, శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లకు చెందిన ప్లానింగ్ అధికారులు, ఏపీఓలను తమ వద్దకు రప్పించి పలు అనుమతులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యంగా 2018 నుంచి 2023 వరకు పని చేసిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ హయాంలో ఇచ్చిన హై రైజ్ భవనాల అనుమతులపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు.ఒకవైపు విజిలెన్స్ సోదాలు కొనసాగుతుండగానే.. మరోవైపు హెచ్ఎండీఏపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హెచ్ ఎండీఏ వ్యవహారంపై సీఎం సీరియస్ అయ్యారు. పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. విజిలెన్స్ విచారణతో నిగ్గు తేల్చాలని నిర్ణయం తీసుకున్న సీఎం.. సమీక్షలో దాడులపై ఆరా తీశారు.

## అదానీ చేతిలో...

# మందుగుండు సామగ్రి, క్షిపణులు

### రూ. 3 వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభం



**టి మీడియా, ఫిబ్రవరి 28,కాన్పూర్ :** దక్షిణాసియాలో అతిపెద్ద మందుగుండు సామగ్రి, క్షిపణుల తయారీకి రెండు మెగా సౌకర్యాల సముదాయాన్ని అదానీ గ్రూప్ ప్రారంభించింది. అదానీ డిఫెన్స్ వై ఏరోస్పేస్ 500 ఎకరాల్లో విస్తరించి ఉన్న కాన్పూర్‌లోని ఫ్యాక్టరీలలో రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టింది. పూర్తి స్పెక్ట్రమ్ మందుగుండు సామగ్రి తయారీ సముదాయాలలో ఒకటిగా మారనుంది. ఇది సాయుధ దళాలు, పారామిలిటరీ బలగాలు, పోలీసుల కోసం అధిక-నాణ్యత కలిగిన చిన్న, మధ్యస్థ, పెద్ద-స్థాయి మందుగుండు సామగ్రిని ఉత్పత్తి చేస్తుంది. ఈ సదుపాయం భారతదేశ వార్షిక అవసరాలలో 25 శాతంగా అంచనా వేయబడిన 150 మిలియన్ రౌండ్లతో ప్రారంభించి, చిన్న క్యాలిబర్ మందుగుండు సామగ్రిని విడుదల చేయడం ప్రారంభించింది. "భారతదేశంలోని ప్రయివేట్ రంగంలో మొట్టమొదటిసారిగా ఉన్న ఈ అత్యాధునిక సౌకర్యాలు దేశం యొక్క స్వావలంబన, రక్షణలో సాంకేతిక పురోగతికి గణనీయ ప్రోత్సాహాన్ని అందిస్తాయి" అని అది ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే "బాలాకోట్ వైమానిక దాడి 'ఆపరేషన్ బందర్' ఐదో వార్షికోత్సవం సందర్భంగా సౌకర్యాల ఆవిష్కరణ, భారత వైమానిక దళం చేసిన చారిత్రాత్మక ఆపరేషన్, ఇది బాహ్య బెదిరింపులపై భారతదేశం యొక్క వ్యూహాత్మక దఢత్వానికి నిదర్శనం," అని ప్రకటన పేర్కొంది. ఈ సౌకర్యాలను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే, సెంట్రల్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్‌రాజా సుబ్రమణి జీవోసీ- ఇన్- సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ ఈ సౌకర్యాలలో ఉత్పత్తి చేయబడిన మందుగుండు సామాగ్రి, క్షిపణులు దేశ భద్రతకు దోహదపడటం గర్వించదగిన తరుణమని అన్నారు. ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సీఈఓ ఆశిష్ రాజ్‌వంశీ తదితరులు ప్రసంగించారు.

## 25 ఏళ్ల తర్వాత

# హైదరాబాద్‌లో బిల్ గేట్స్



**టీ మీడియా, ఫిబ్రవరి 28, హైదరాబాద్:** సరిగ్గా 25 ఏళ్ల క్రితం 1998లో తాను ప్రారంభించిన హైదరాబాద్‌లోని మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్(ఐడీసీ)ని సంస్థ అధినేత బిల్ గేట్స్ బుధవారం సందర్శించారు.. ఈపర్యటన సందర్భంగా ఐడీసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ, క్లౌడ్, గేమింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో మైక్రోసాఫ్ట్ ఆవిష్కరణలకు ఐడీసీ కేంద్రం కానుందని చెప్పారు. ఐడీసీలో ఇంజినీర్లను ఉద్దేశించి బిల్‌గేట్స్ చేసిన ప్రసంగం గొప్పదన్నారు. ఏఐ పవర్డ్ ఇండియాపై బిల్ గేట్స్ మరోసారి ఆశాభావం వ్యక్తం చేశారని చెప్పారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ఐడీసీ కీలక పాత్ర పోషిస్తోంది. అజూర్, విండోస్, ఆఫీస్, బింగ్, కోపిలాట్, ఇతర ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ అభివృద్ధి వెనుక ఐడీసీ కీ రోల్ ప్లే చేసింది.

# రాజీనామా వార్తలను కొట్టిపారేసిన హిమాచల్ సీఎం

**టీ మీడియా, ఫిబ్రవరి 28, న్యూఢిల్లీ:** తాను ఎవరికీ రాజీనామాను సమర్పించలేదని హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు తెలిపారు. తన రాజీనామా గురించి బీజేపీ వదంతులు వ్యాపింప చేస్తున్నదని ఆయన అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో అక్కడ కాంగ్రెస్ సర్కార్‌పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడడంతో.. బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. దీంతో సుఖ్విందర్ సర్కార్ ప్రమాదంలో పడింది. సుఖ్విందర్ రాజీనామా చేశారని బీజేపీ నేత జైరాం ఠాకూర్ ఆరోపించారు. ఈ ఆరోపణలపై సీఎం సుఖ్విందర్ స్పందించారు. ఎవరు కూడా తన రాజీనామా గురించి ప్రస్తావించలేదన్నారు. తాను ఎవరికీ రాజీనామా సమర్పించలేదన్నారు. తమ మెజార్టీని ప్రూవ్ చేస్తామన్నారు. బడ్జెట్ సెషన్‌లో తాము గెలవనున్నట్లు చెప్పారు.

## ఘనంగా మోడాల సుజాతాదేవి ప్రథమ వర్ధంతి

- అనాథ బాలలకు అన్నదానం



**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రం చిట్యాల గ్రామ చేయూత అనాథ ఆశ్రమంలో బుధవారం మోడాల సుజాతాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుజాతాదేవి భర్త సీనియర్ పాత్రికేయ, ధ్యాన, వ్యక్తిత్వ వికాస నిపుణులు మోడాల చంద్రశేఖర్, కూతురు ఎండీ వైద్యురాలు డా. మోడాల రచన పాల్గొని అనాథ బాలలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణానికి చెందిన మోడాల సుజాతాదేవి ప్రభుత్వ సీనియర్ ఆరోగ్య పర్యవేక్షణ అధికారిణిగా, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు విట్టా శ్రీనివాస్ రెడ్డి, సేవకులు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన గ్రామస్తులు

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**
ఆత్మకూరు మండలం బాలకిష్టాపురం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు.సిసి రోడ్ రోడ్ నిర్మాణానికి 11 లక్షల 50వేల ఎన్ఆర్ఈఎస్ వర్క్ బాల కిష్టా పురం కి 325 మీటర్ల క్కు గ్రామస్తులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మండల నాయకులు పాల్గొన్నారు. మండల్ నాయకులుఎండి రహమతుల్లా, రాయచూర్ పరమేష్, నల్గొండ శ్రీనివాసులు, మక్తల్ నియోజకవర్గం ఇంచార్జ్ తులసి రాజ్ యాద వ్, గ్రామ అధ్యక్షులు గంగా నాయక్ , మైముద్ , మాజీ వార్డ్ మెంబర్ చిరంజీవి, గఫూర్ , బషీర్ మైనార్టీ యూత్ మహిళ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 16 నుంచి తరిగొండ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**టీ మీడియా, ఫిబ్రవరి 28, తిరుపతి :**



తరిగొండ లక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో మార్చి 16 నుంచి 24వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు వివరించారు. మార్చి 15న సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 21న రాత్రి 8 నుంచి 10 గంటల వరకు కల్యాణోత్సవం, 25న పుష్పయాగం 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నోస్కూల్ నందు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వనపర్తి జిహెచ్చం గణేష్, ఏజీఎం భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. చైర్మన్ మల్లెపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు చిన్నతనం నుండే సైన్స్ ఫేర్ పట్ల ఆసక్తి పెంపొందించుకుంటాని .తెలియజేస్తూ విద్యార్థులను అభినందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం నందు కోఆర్డినేటర్ మధుగౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ జవహర్ బాబు , ఇంచార్జి ప్రతిమ, డీన్- గోపీ, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

## ప్రేమ్ టైలర్ ఆధ్వర్యంలో టైలర్స్ డే

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా షిరిడి సాయి కాంప్లెక్స్ లో ప్రేమ్ టైలర్ షాప్ లో టైలర్ మన్యం ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని హెలియాస్ హెూవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని గన్ని బ్యాగులను ప్లాస్టిక్ కవర్ ను నిషేధించాలని టిఫిన్ బాక్స్ లను దాదాపు 50 మంది దాకా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మారిన ఫ్యాషన్ ప్రపంచంలో దర్జీలకు దర్జా లేదు. రెడీమేడ్ రంగం విస్తరించడంతో టైలరింగ్‌కు గిరాకీ తగ్గిందని, పరిస్థితి దయనీయంగా మారిందని దర్జీలు పేర్కొంటున్నారు. టైలర్ దుకాణాల కుట్టు కుదేల్ అవుతున్నది. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, ఉచిత కరెంట్ అందించాలని కోరుతున్నారు. వారి జీవితాలకు టైలరింగే అధారంగా మారింది. ఏండ్ల తరబడిగా కుట్టులోనే జీవితాలను గడుపుతూ అద్దె ఇండ్లల్లో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పూటకు ఐదువేళ్లు నోట్లోకి వెళ్తున్నా.. జీవితానికి భద్రత మాత్రం శూన్యం. ఆరోగ్య సమస్యలు సైతం వెంటాడుతుండటం, కంటిచూపు దెబ్బతినడంతో భవిష్యత్ అంధకారంగా మారింది. కొంతకాలం కిందట రెడీమేడ్ వస్త్రాలతో గిరాకీలు తగ్గినా ఇప్పుడిప్పుడే మళ్లీ టైలరింగ్‌కు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. పూర్వకాలంలో పద్మశాలీలు మాత్రమే వస్త్రాలు కుట్టేవారు. ప్రస్తుతం అన్నివర్గాల వారు టైలరింగ్‌లో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతోపాటు పెండ్లిళ్లు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.



## పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలో బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ బుధవారం సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్ష కేంద్రాలు విద్యార్థులను ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష జరుగుతున్న తీరుపై అధికారుల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు మొత్తం ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు అని ఇంటర్మీడియట్ నోడల్ అధికారిని ప్రశ్నించారు. స్పందించిన అధికారి బుధవారం జిల్లావ్యాప్తంగా జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలకు 6940 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6627 మంది విద్యార్థులు పరీక్షలు హాజరయ్యారని 313 మంది విద్యార్థులు గైర్హాజరైన అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, వనపర్తి జిల్లా ఇంటర్నెట్ నోడల్ అధికారి మద్దిలేటి, వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్, కలెక్టర్ సిసి తిలక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## వైసీపీకి ఒంగోలు ఎంపీ మాగుంట రాజీనామా

**టి మీడియా, ఫిబ్రవరి 28,ఒంగోలు :**
వైసీపీ పార్టీకి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రాజీమా చేశారు. ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి. ఈ సందర్భంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ%óÔ% మాగుంట కుటుంబం 34 ఏళ్లుగా ఒంగోలులో రాజకీయాలు చేస్తోంది..మాగుంట కుటుంబాన్ని ప్రకాశం జిల్లా ప్రజలు అక్కున చేర్చుకున్నారన్నారు. ప్రకాశం జిల్లా వాసులను కుటుంబ సభ్యులుగా భావిస్తూ వస్తున్నామని%óÔ%మాగుంట కుటుంబానికి, ప్రజలకు అవినాభావ సంబంధాలు ఉన్నాయని వివరించారు. ఈ 33 ఏళ్లలో 8 సార్లు పార్లమెంట్ కి, ఒకసారి ఎమ్మెల్సీగా పోటీ చేశాం..మా కుటుంబం కోరుకునేది కేవలం గౌరవమన్నారు. మాకు ఇగోలు లేవు..రాబోయే ఎన్నికల్లో మా కుటుంబం ఓ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. మా కుమారుడు మాగుంట రాఘవరెడ్డిని పోటీలో ఉంచాలని నిర్ణయించాం..ప్రస్తుత పరిణామాలు బాధాకరమని తెలిపారు.



ఇది ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని%óÔ% అనివార్య పరిస్థితుల్లో వైసీపీని వీడాలనుకుంటున్నారు. సీఎం జగన్ నుంచి కూడా ఈ ఐదేళ్లలో సహాయ సహకారాలు అందాయని చెప్పారు. ఇప్పటివరకు సహకరించిన పార్టీ నేతలకు ధన్యవాదాలు అన్నారు. ఎంతో బాధతో పార్టీ నుంచి రాజీనామా చేస్తున్నా..త్వరలో రాజకీయ భవితవ్యంపై నిర్ణయం ఉంటుందన్నారు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి.

## హెచ్ఎండిఏలో విజిలెన్స్ దాడులు

**టీ మీడియా, ఫిబ్రవరి 28, హైదరాబాద్ :**
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ)లో బుధవారం రెండో రోజు కూడా విజిలెన్స్ అధికారులు సోదాలను కొనసాగించారు. మైత్రివనం నాలుగో అంతస్తులో ఉన్న అన్ని ఫైళ్లను సీజ్ చేశారు. హెచ్ఎండిఏలో గత తొమ్మి దేళ్లలో ఇచ్చిన అనుమతులను పరిశీలిస్తున్నారు. 50 మందితో కూడిన స్పె షల్ విజిలెన్స్ బృందం సోదాలు నిర్వహిస్తు ఫైళ్లను స్వాధీనం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఒకవైపు హెచ్ఎండీఏ సమీక్షా సమావేశానికి సిద్ధమవ్వగా, మరోవైపు విజిలెన్స్ అధికారులు హెచ్ఎండీఏలో సోదాలు కొనసాగించడం గమనార్హం.

ఇప్పటికే హెచ్ఎండీఏ మాజీ డైరక్టర్ శివ బాల కృష్ణను 270కోట్ల అక్రమాస్తుల కేసులో ఏసీబీ అరెస్టు చేసింది. అతని అక్రమాలతో పలువురు ఐఏఎస్‌లకు కూడా సంబంధాలున్నట్లుగా ఏసీబీ గుర్తించింది.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**
పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామానికీ చెందిన శ్యాంసుందర్రావు కూతురి వివాహ వేడుకల్లో పాల్గొని వధువరులని ఆశీర్వదించిన తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డి .ఇట్టి కార్యక్రమము లో పీసీసీ సభ్యులు కిరణ్ కుమార్ , వనపర్తి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దివాకర్ యాదవ్ , వనపర్తి జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షుడు రోహిత్ , వనపర్తి 30వ వార్డు అధ్యక్షుడు నవీన్ , యువజన కాంగ్రెస్ నాయకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ సారూ.. ముఖ్యమంత్రిగా మాట్లాడండి

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**టీ మీడియా, ఫిబ్రవరి 28, హైదరాబాద్ :**
కాంగ్రెస్ పార్టీ నాయకుడిగానే రేవంత్ రెడ్డి భాష ఉందని.. ముఖ్యమంత్రి అనే సోయి రేవంత్ రెడ్డికి లేదన్నారు మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్. ఇందిరమ్మ రాజ్యం అంటూ మహిళలను అగౌరవపర్చే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఎన్ని హామీలు ఉన్నాయో రేవంత్ రెడ్డికి తెలుసా అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కిందనే మూడు హామీలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ లో ఆమె మీడియాతో మాట్లాడుతూ, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 హామీ ఏమైందని క్వశ్చన్ చేశారు. రూ.500 గ్యాస్ సబ్సిడీ 40 లక్షల మందికి మాత్రమే వర్తిస్తుందన్నారు. మొత్తం రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులున్నాయన్నారు. గ్యాస్ కనెక్షన్లు కేవలం మహిళల పేరు మీద ఉంటేనే సబ్సిడీ వస్తుందని ప్రభుత్వం చెప్తోందని.. గ్యాస్ కనెక్షన్లు పురుషుల పేరు మీద ఉన్నా



సబ్సిడీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ డబ్బులు మొత్తం కట్టించుకుని సబ్సిడీ డబ్బులు బ్యాంకు ఖాతాలో వేస్తామని అంటున్నారని, దీనితో గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకం బోగస్ పథకంగా మారిందన్నారు. రాష్ట్రంలో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. మహిళలకు సరిపడా బస్సులను ప్రభుత్వం నడపాలని కోరారు.

## బండి సంజయ్ వేములవాడ దేవస్థానానికి ఏం చేశాడో చెప్పాలి

- మంత్రి పొన్నం

**టీ మీడియా, ఫిబ్రవరి 28, రాజన్న సిరిసిల్ల :**



రాముడి జన్మ ఎక్కడైనా అని అడిగే మూరు?డు ఉన్నాడా? రాముని పేరు చెప్పి ఓట్లు అడుకుంటున్నారు. మార్కెటింగ్ చేసుకుంటున్నారు. రాముడి గురించి తప్పుగా మాట్లాడితే సజీవ దహనానికి సిద్ధమని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం వేములవాడ మండలం నాంపల్లి శ్రీలక్ష్మి నరసింహ స్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బండి సంజయ్ అమ్మకు పుట్టినవా అని అన లేదు అంటున్నాడు. అమ్మను రాజకీయాల్లోకి తీసుకువచ్చింది ఎవరని ప్రశ్నించారు. హుస్నాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద బతికున్న మా అమ్మను పట్టుకొని తప్పుగా మాట్లాడావు. మా అమ్మ ఆత్మ ఘోషిస్తుంది వెధవ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో కరీంనగర్ ఎంపీగా చేసిన అభివృద్ధిపై చర్చకు రమ్మంటే రావడం లేదన్నారు. హిందువుని చెప్పు కుంటున్న బండి సంజయ్ వేములవాడ దేవస్థానానికి ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. దండం పెట్టి అడుగుతున్న.. అందరిని కోరుతున్న ఈ మూరు?డు ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గానికి ఏం చేశాడో నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## చిన్నారెడ్డికి ఘనంగా సన్మానించిన దేవన్నయాదవ్

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**



తెలంగాణ రాష్ట్ర స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ %ౖ% మాజీ మంత్రి డాక్టర్.జి.చిన్నారెడ్డి ని, అతని కుమారుడు ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డిని బుధవారం ప్రగతిభవన్లో మర్యాదపూర్వకంగా కలిసి, పూల బొకే తో స్వాగతం పలికి, శాలువాతో సన్మానించిన, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ దేవన్న యాదవ్. ఈ సందర్భంగా దేవన్న యాదవ్ మాట్లాడుతూ, గడిచిన 45 సంవత్సరాలుగా తన జీవితాన్ని పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కోసం, దార పోసిన మాజీ మంత్రి డాక్టర్.జి.చిన్నారెడ్డి అని, సీఎం రేవంత్ రెడ్డి తన క్యాబినెట్లో సముచిత స్థానం కల్పించడం సంతోషంగా ఉందని దేవన్న యాదవ్ అన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన డాక్టర్.జి.చిన్నారెడ్డి కి, తెలంగాణ రాష్ట్ర స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ గా పదవి రావడం ఎంతో ఆనందంగా ఉందని దేవన్న యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. వనపర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి బాటలో ప్రయాణిస్తుందని ఆశ బావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణలో తమ వంతు పాత్ర విజయవంతంగా పోషించాలని ఆకాంక్షిస్తూ అన్ని విధాల కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ శుభ సందర్భంగా ఫ్యామిలీతో యాదగిరిగుట్ట మొక్కు తీర్చుకోవడానికి వెళుతున్నానని వనపర్తి జిల్లా, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ దేవన్న యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.

## ప్రతిపక్షాలపై ఆగని కేంద్రం దాడులు

- అఖిలేష్ యాదవ్‌కి సిబిఐ సమన్లు

**టీ మీడియా, ఫిబ్రవరి 28, న్యూఢిల్లీ :**



ప్రతిపక్షాలపై కేంద్రం దాడులకు దిగుతోంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) 8 సార్లు సమన్లు జారీ చేసింది. జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ని కూడా అవినీతి ఆరోపణలపై అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అక్రమ మైనింగ్ కేసులో సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) బుధవారం సమన్లు జారీ చేసింది. సాక్షిగా విచారణకు హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. గురువారం దర్యాప్తు సంస్థ ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అఖిలేష్ యాదవ్ 2012 నుంచి జూన్, 2013 మధ్య మైనింగ్ శాఖను నిర్వహించాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఏడు జిల్లాలు, షామ్లీ, కౌశాంబి, ఫతేపూర్, డియోరియా, సహరాన్‌పూర్, హమీర్‌పూర్ మరియు సిద్ధార్థనగర్‌లో అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. 2012 నుంచి 2016 మధ్య కాలంలో నిబంధనలను పాటించకుండా ప్రభుత్వ అధికారులు కొన్ని అక్రమ మైనింగ్ స్థలాలను కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌జీటీ ఆదేశాలను ఉల్లంఘించి మైనింగ్ హక్కులు కూడా ఇచ్చారని సిబిఐ పేర్కొంది.

## టీడీపీకి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు రాజీనామా

- వైసీపీలో చేరిక

**టీ మీడియా, ఫిబ్రవరి 28, అమరావతి :**



మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు టీడీపీకి రాజీనామా చేసిన వైసీపీలో చేరారు. బుధవారం ఏపీ సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఆ పార్టీ కండువాను కప్పుకున్నారు. ఇటీవల టీడీపీ, జనసేన ప్రకటించిన ఉమ్మడి ఎమ్మెల్యేల అభ్యర్థుల జాబితాలో గొల్లపల్లి పేరు లేకపోవడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పొత్తులో భాగంగా రాజోలు సీటును టీడీపీ జనసేనకు కేటాయించింది. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబుకు లేఖ రాశారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేశానని, తనకు రాజోలులో సీటు ఇవ్వకుండా అవమానించారని పేర్కొన్నారు. 2019 నుంచి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రతికూల పరిస్థితిలో కూడా రాష్ట్ర పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని నిబద్ధతతో , క్రమ శిక్షణతో పనిచేసి పార్టీ ప్రతిష్టను నిలబెట్టానని వెల్లడించారు. ప్రకటించిన మొదటి 94 ఎమ్మెల్యేల స్థానాల్లో నన్ను అభ్యర్థిగా ప్రకటించే అర్హతలు ఉన్నప్పటికీ నా పేరును పరిగణలోనికి తీసుకోకపోవడం అత్యంత బాధ కలిగించిందని అన్నారు. నా ఆత్మగౌరవానికి భంగం కలిగిన ఇటువంటి పరిస్థితిలో పార్టీలో కొనసాగలేనని, టీడీపీ పదవులకు, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాని స్పష్టం చేశారు. తనను టీడీపీ నుంచి గెంటివేసినా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తనను అక్కున చేర్చుకుని పార్టీలోకి ఆహ్వానించారని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం, అభ్యర్థి విజయానికి అహర్నిశలు కృషి చేస్తానని సూర్యారావు అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన గొల్లపల్లి సూర్యారావు ఎన్టీఆర్, వైఎస్సార్ హయాంలో మంత్రిగా పనిచేశారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేశారు.



## ద్వార సమావేశం

**టీ మీడియా, ఫిబ్రవరి 28, గోదావరిఖని:**
జీడీకే వన్ ఇంక్లైన్ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షులు ఆకులహరీన్ ఆధ్వర్యంలో ద్వారా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షులు యాదగిరి సత్తయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ డెసిగ్నేషన్ ఉండడం కారణంగా భూగర్భ గనులలో డిపార్ట్మెంట్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులలో సంవత్సరాల తరబడి సామాజిక భద్రత లేకుండా యాజమాన్యాలు కనీసం గౌరవప్రదంగా పిలవకుండా అవహేళన చేసుకుంటూ తోటి కార్మికులతో చిన్న చూపు చూస్తున్న యజమాన్యాల వైఖరి మారాలని అనేక సంవత్సరాలుగా సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం యూనియన్ ఆధ్వర్యంలో ద్వారా సమావేశాల గౌరవపదమైన డిసిగ్నేషన్ మార్పిడి చేయాలని, అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామని తుది నిర్ణయం ఫిబ్రవరి 6న జై సాల్మేర్ రాజస్థాన్ స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సమావేశంలో ఏ బి కే ఎం ఎస్, బి ఎం ఎస్ తరపున సుదీర్ఘంగా చర్చించి ఒక అవగాహనకు వచ్చిందని, బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ డిసిగ్నేషన్ రద్దు చేస్తూ గౌరవప్రదమైన హెూదా కల్పించుటకు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. తదుపరి సమావేశంలో కార్మికులకు సామాజికంగా హెూదా కల్పిస్తూ ఆర్థిక ప్రయోజనాలు అందించే విధంగా మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.



## ఆర్కే వన్ ఏ సమ్మక్క సారక్క గద్దెల వద్ద తిరుగువారం పండుగ

**టీ మీడియా, ఫిబ్రవరి 28, రామకృష్ణాపూర్ :**
రామకృష్ణాపూర్ ఆర్కే వన్ ఏ గని సమీపంలో గల సమ్మక్క,సారక్క గద్దెల వద్ద ఆదివాసి పూజారులు బుధవారం శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేసి,తిరుగువారం నిర్వహించడం జరిగింది. అనంతరం మందమర్రి జిఎం మాట్లాడుతూ.. జాతర ఎంతో వైభవంగా జరిగింది. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి జిఎం ధన్యవాదాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మనోహర్,ఎస్ ఓ టు జి ఎం రాజేశ్వర్ రెడ్డి ,పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ,ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, ఆర్కే వన్ ఏ మేనేజర్ జయంత్ కుమార్ ,కేకే -5 వెల్ఫేర్ ఆఫీసర్ కార్తీక్ ,గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రెటరీ సలీంద్ర సత్యనారాయణ,అక్బర్ అలీ,రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ ఆంజనేయులు, సుదర్శన్,లింగయ్య,ఏఐటియుసి ఫిట్ సెక్రెటరీలు, టీబీజీకేఎస్ మేడిపల్లి సంపత్, జె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఇసుక మాఫియా

- పలు శాఖల అధికారులను మోసం చేస్తూ ఇష్టానుసారంగా ఇసుక తరలింపు

**టీ మీడియా, ఫిబ్రవరి 28 , వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని ఈదుల చెరువులో ఇష్టానుసారంగా ఇసుక మాఫియాకు తెర లేపారు. పలు శాఖల అధికారులను మోసం చేస్తూ, ఇష్టానుసారంగా ఇసుకను రీసైకిలింగ్ చేస్తున్నారు. అర్ధరాత్రి వేళలో ఒక్కొక్కరు పదుల ట్రిప్పుల ఇసుకను అధికారుల కళ్ళు కప్పి తరలిస్తున్నారు. ఈదుల చెరువు చుట్టూ ప్రాంతంలోని వెలసిన వందల ట్రాక్టర్ల ఇసుక డంపింగ్ లు. కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలు ముగిసేసారికి ఇసుక మాఫియా దళారీలపై ఉక్కు పాదం మోపింది, కానీ ఈదుల చెరువులో ఇసుకకు పులిస్టాప్ పడేది ఎప్పుడో ఎదురు చూడాలి. చెరువులోని ఇసుకను అక్రమంగా తరలించడం వలన చెరువులో ఉన్నటువంటి పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.

# కొత్త తెల్ల రేషన్ కార్డుల జారీ

● అప్డేట్ ఇచ్చిన మంత్రిపొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 28 ,ఖమ్మంబ్యూరో :**
పాలేరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్తో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఆ తర్వాత మహమ్మదాపురంలో రూ.5 కోట్లతో నిర్మించనున్న గిరిజన మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, వెంకటగిరిలో రూ.2.65 కోట్లతో నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన ఆరు హామీల్లో ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిందన్నారు. మరో రెండు హామీలు (ఉచిత విద్యుత్, రూ.500 సిలిండర్) కూడా అమల్లోకి తెచ్చారు.ప్రభుత్వం ఎంత కష్టమైనా హామీని నెరవేరుస్తుంది. ప్రజా పాలన కార్యక్రమంలో ఇచ్చిన దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హులైన వారందరికీ రూ.500కే ఎల్పీజీ సిలిండర్ ఇస్తామని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం వేలాది ఎకరాలను ఆక్రమించిందని ఆరోపించారు. అర్హులైన కుటుంబాలకు త్వరలోనే తెల్ల రేషన్ కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. మహిళలకు త్వరలోనే రూ.2,500 సాయం అందిస్తామని ఆయన అన్నారు



బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాలామంది పేదలకు రేషన్ కార్డులు అందక ఇబ్బందులు పడ్డారు. మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో కేసీఆర్ కీలక ప్రకటన చేశారు. కానీ ఎన్నికల కోడ్, ఇతరత్రా సమస్యల వల్ల సాధ్యపడలేదు. అయితే కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులోని కొన్ని పథకాలకు కార్డు అనుసంధానం తప్పనసరి కావడంతో చాలామంది వినియోగదారులు కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనతో దరఖాస్తులు చేసుకున్నారు. ఇతర పథకాల కంటే రేషన్ కార్డు జారీ కోసమే ఎక్కువ అప్లికేషన్స్ రావడం గమనార్హం.

## పరీక్ష కేంద్రాలను సందర్శించిన సిపి

**టీ మీడియా, ఫిబ్రవరి 28, గోదావరిఖని:**



రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం అయిన సందర్భంగా బుధవారం గోదావరిఖనిలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సందర్శించారు. పోలీస్ బందోబస్తు అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష నిర్వహణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షణ చేసి అధికారులకు పలు సూచనలు, చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ ఇంటర్నెట్ సెంటర్స్ మూసివేయాలన్నారు. పరీక్ష సెంటర్స్ వద్ద ప్రజలు గుమికూడా వద్దు అని ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

## సీసీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించిన ఉప సర్పంచ్

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా పెద్ద మందడి మండలం అల్వాల గ్రామంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు సీసీ రహదారి పనులను భూమి చేసి ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి ఎనిమిది లక్షల ఏనాభై వేల రూపాయల నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే మెగా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని జి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంగ్రెస్ కార్యకర్తలు చంద్రశేఖర్ రెడ్డి, రాజ వర్ధన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సాయి కుమార్ రెడ్డి,నరేష్ రెడ్డి, అజ్గర్,శేఖర్ యాదవ్, సింగిరెడ్డి పెంటన్న, భాస్కర్ రెడ్డి, మైబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని లలితా పబ్లిక్ హై స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సైన్స్ ప్రయోగాల ప్రదర్శనలు చేశారు, ప్రైమరీ విద్యార్థులు కూడా చక్కగా తమ తమ స్థాయి ప్రయోగాలను ప్రదర్శించారు, ముఖ్యంగా ఎనిమిదో తరగతి ఆకర్ష అనే విద్యార్థి మొక్కలు మానవాళికి ఉపయోగపడుతున్న విధానాలను చక్కగా వివరిస్తూ పలువురుని ఆకర్షించాడు. నాల్గొవ తరగతి ఋషి కుమార్ గృహంలో వాడుకునే సాధారణ ఇంగ్రిడియంట్స్ ఉపయోగించి దోమల నివారణ ఎలా చేపట్టాలి అనే సాధారణ విధానాన్ని వివరించాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, రామ కృష్ణా రెడ్డి,లలిత, దుర్గా, సుజాత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భక్తులకు ఎమ్మార్పీ ధరలకే నాణ్యమైన ఆహారం అందజేయాలి

● శివరాత్రి బ్రహ్మోత్సవాలు జయప్రదం చేద్దాం ● నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 28, మహానంది:**



అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జయప్రదం చేద్దామని నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి అన్నారు.బుధవారం మహానంది క్షేత్రంలోని పోచ బ్రహ్మానంద రెడ్డి విశ్రాంతి భవనంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ సమావేశంలో అధికారులతో ఆర్డిఓ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డిఓ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ మహానంది క్షేత్రానికి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు, ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. అదేవిధంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం, దుకాణదారులు ఎంఆర్పి రేట్లకే, అన్ని వస్తువులు అమ్మాలని, హెూటల్స్ లలో నాణ్యత లోపించకుండా కల్తీ లేని ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు త్రాగునీరు, పార్కింగ్, పారిశుద్ధ్యం, విద్యుత్ అంతరాయాలు లేకుండా చేయాలని అన్నారు. డిఎస్పి రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా, జాగ్రత్తలు తీసుకుంటామని, క్షేత్రంలో ముఖ్య కూడలిలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దొంగతనాలు ,ఘర్షణలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. క్షేత్ర పరిసరాలలో శివరాత్రి మూడు రోజులు మద్యం దుకాణాలు బంద్ చేయిస్తామన్నారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా, దర్శన టికెట్ల కోసం, ఏడు బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ, బిస్కెట్స్, త్రాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రసాదాలు, అందరికీ అందే విధంగా నాలుగు కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా లింగోద్భవం సమయంలో ప్రతి ఒక్క భక్తునికి దర్శనం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తాహసిల్దార్ శ్రీనివాసులు,సిఐ శివకుమార్ రెడ్డి మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత

### భద్రతా బలగాల మోహరింపు



**టి మీడియా, ఫిబ్రవరి 28,ఇంఫాల్ :** మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో ఇంఫాల్ ఈస్ట్ ప్రాంతంలో అస్సాం రైఫిల్స్‌ను మోహరించారు. మెయితీ కమ్యూనిటీకి చెందిన ఆరంబారు టెంగోల్ కార్యకర్తలు ఓ సీనియర్ పోలీసు అధికారిని కిడ్నాప్ చేశారని అధికారులు తెలిపారు. స్పందించిన పోలీసు, సెక్యూర్టీ బలగాలు తక్షణమే స్పందించి అదనపు ఎస్పి అమిత్ కుమార్‌ను రక్షించాయని అన్నారు. ప్రస్తుతం ఆయనను ఆస్పత్రిలో చేర్పించామని, ఆయన పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. మంగళవారం రాత్రి ఏడు గంటల సమయంలో ఈ కిడ్నాప్ జరిగింది. ఇంపాల్ ఈస్ట్‌లోని వాంగ్‌ఖేరులో ఉన్న అమిత్ కుమార్ నివాసంపై మెయితీ కమ్యూనిటీ అటాక్ చేసినట్లు తెలుస్తోంది. ఆయన ఇంటిలో దోపిడీకి పాల్పడటంతో పాటు సుమారు నాలుగు వాహనాలను ధ్వంసం చేశారని వారు అన్నారు. వాహనచోరీకి పాల్పడ్డారంటూ మెయితీ కమ్యూనిటీకి చెందిన ఆరుగురు సభ్యులను అమిత్‌కుమార్ అరెస్ట్ చేశారు. వారిని విడుదల చేయాలంటూ మీరా పైబీస్ (మెయితి మహిళా బృందం) నిరసన వ్యక్తం చేసింది. రోడ్లను దిగ్బంధించింది.

## ఐదో విడత రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం జగన్..

**టి మీడియా, ఫిబ్రవరి 28,అమరావతి:**



ఐదో విడత రైతు భరోసా అందిస్తున్నామని సీఎం జగన్ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ మాట్లాడుతూ.. 'దేశంలో బీమా ప్రీమియం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే. అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం పెంచాం. రైతులకు 9 గంటల విద్యుత్ అందిస్తున్నాం. ఇప్పటివరకు రైతు భరోసా కింద రూ.34,288 కోట్లు చెల్లించాం. మొత్తం 53.58 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఎన్నికల సమయంలో పెట్టుబడి సాయం కింద 12,500 రూపాయలు ఇస్తామని చెప్పామని.. అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయాన్ని పెంచాం.. రైతులకు 9 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తున్నాం.. ఆక్వా రైతులకు రూపాయిన్నరకే కరెంట్ ఇస్తున్నాం. గతంలో చంద్రబాబు రుణాలు మాఫీ చేస్తామంటే నమ్మి ఓటేశారు.. కానీ, అధికారంలోకి వచ్చాక రుణమాఫీ సంగతి మరిచిపోయారు.. చంద్రబాబు చివరికి సున్నా వడ్డీ పథకాన్ని సైతం ఎగ్గొట్టారు ఆరోపించారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలను వైసిపి ప్రభుత్వమే చెల్లించిందని తెలిపారు.

## తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటన..

### పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం..

**టీ మీడియా, ఫిబ్రవరి 28, తూత్తుకుడి :**



తమిళనాడులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు ప్రధాని మోదీ. తూత్తుకుడి కేంద్రంగా నిర్మించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజెన్ హబ్ పోర్ట్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టుల్లో ఔటర్ హార్బర్, కంటైనర్ టెర్మినల్స్ కూడా ఉన్నాయ్. మొత్తంగా 17వేల కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు మోదీ చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి.కులశేఖరపట్టణం లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ.. రెండో అంతరిక్ష నౌకాశ్రయానికి శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. 2వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ స్పేస్‌పోర్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. శ్రీహరికోటకు ప్రత్యామ్నాయంగా దీన్ని నిర్మిస్తున్నారు. శ్రీహరికోట కంటే కులశేఖరపట్టణం.. భూమధ్యరేఖకు దగ్గరగా ఉండటంతో రాకెట్ విడిభాగాల రవాణా మరింత ఈజీకానుంది. సమయం, ఖర్చు రెండూ తగ్గనున్నాయి.

# బీజేపీలోకి బీఆర్ఎస్ ఎంపీ

● ఢిల్లీలో సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం..

● 4, 5 తేదీల్లో ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటన

**టీ మీడియా, ఫిబ్రవరి 28, ఢిల్లీ :**



ఒకవైపు అభ్యర్థుల ఖరారుపై బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ ఫోకస్ పెడితే.. మరోవైపు తెలంగాణలో ఎన్నికల శంఖారావం పూరించేందుకు సిద్ధమవుతున్నారు ప్రధాని మోదీ. మార్చి 4, 5 తేదీల్లో వరుసగా రెండ్రోజులపాటు తెలంగాణలో పర్యటించనున్నారు. మార్చి 4న ఆదిలాబాద్, 5న సంగారెడ్డిలో పర్యటిస్తారు ప్రధాని. అధికారిక కార్యక్రమాలతోపాటు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు మోదీ. ఇదిలా ఉంటే ఈలోపే తమ అభ్యర్థిత్వాన్ని కన్ఫాం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు కొందరు కీలక నేతలు. ఈ విషయంపై చర్చించేందుకు బీజేపీ ఆశావహులు ఢిల్లీకి క్యూకడుతోన్నారు. మరీ ముఖ్యంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంపై కన్నేశారు పలువురు పెద్ద నేతలు. ఈ నియోజకవర్గం సీటు ఆశిస్తున్న విద్యాసంస్థల అధిపతి మల్క కొమురయ్య రెండ్రోజులుగా ఢిల్లీలోనే ఉంటూ బీజేపీ పెద్దలను కలిసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇక పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ టికెట్ కోసం కొయ్యల ఎమాజీ శ్రమిస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమాజీకి బెల్లంపల్లి టికెట్ ఇచ్చి చివరి నిమిషంలో మార్చింది బీజేపీ అధిష్టానం. ఇలా చివరి నిమిషంలో బీఫామ్ మరొకరికి ఇవ్వడంతో తాజాగా పెద్దపల్లి ఎంపీ సీటు ఇవ్వాలని కోరుకుంటున్నారు ఎమాజీ. పెద్దపల్లిలో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు రాష్ట్ర నాయకత్వం ప్రయత్నం చేస్తోంది. బీఆర్ఎస్‌లోని ఓ విద్యావేత్త సహా మరో ఇద్దరు ముఖ్యనేతల కోసం సంప్రదింపులు జరుపుతోంది. బీజేపీలో చేరనున్నారు నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు. ఈయనతోపాటు మరికొందరు నేతలు కాషాయ కండువా కప్పుకోనున్నారు. ఈ క్రమంలోనే రేపు ఢిల్లీలో బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా దాదాపు100కి పైగా లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉంది. తొలి జాబితాలోనే తెలంగాణ నుంచి ఆరేడుగురు అభ్యర్థుల పేర్లు ఉండేలా కసరత్తు చేస్తోంది. ఇందులో నలుగురు సిట్టింగ్ ఎంపీలకు గానూ మూడు సీట్లు ఖరారుచేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ముగ్గురు సిట్టింగ్‌లతోపాటు మరో నాలుగు స్థానాలకు అభ్యర్థులు ప్రకటించాలని భావిస్తోంది బీజేపీ అధిష్టానం. ఈ జాబితాలో తమ పేర్లు వచ్చేలా పావులు కదుపుతున్నారు కీలక నేతలు. మరి వీరి ఢిల్లీ ప్రయాణం, టికెట్ కోసం చేసిన ప్రయత్నం ఫలిస్తుందా లేదా అనేది రేపు తొలిజాబితాలో తేలిపోనుంది.

## కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**



ఆర్‌బిఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు -2024లో భాగంగా వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి ఆదేశానుసారంతో వనపర్తి జిల్లా సైబర్ క్రైమ్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వనపర్తి యూనియన్ బ్యాంక్ మేనేజర్ సిబ్బంది వారితో వనపర్తి మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. మొదటగా సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త ట్రెండ్‌ల సైబర్ నేరాల గురించి వివరించారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ జాబ్ మోసం, లోన్ యాప్ మోసాలు, క్రెడిట్, డెబిట్ కార్డ్‌ల మోసాలు ఆధార్ బయోమెట్రిక్ మోసాల గురించి వివరించారు. తరువాత యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శేఖర్ రెడీ మాట్లాడుతూ భారత రిజర్వ్ బ్యాంక్ ఆర్బిఐ 2016 నుండి ప్రతి సంవత్సరము ఆర్థిక అక్షరాస్యత వారాన్ని ఎఫ్ ఎల్ డబ్ల్యు ను పాటిస్తూ బాధ్యతయుతమైన ఆర్థిక ప్రవర్తనలో నిమగ్నం అవ్వడానికి సమాచారంతో కూడిన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి ప్రజలకు ఆర్థిక విద్య సందేహాలు విస్తృతంగా ప్రచారం చేస్తుంది. ఈ సంవత్సరం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల థీమ్ ను 2024 ఫిబ్రవరి 26 నుండి మార్చి ఒకటి వరకు ఆర్థికంగా స్మార్ట్ అవ్వండి సేవింగ్ అండ్ పవర్ ఆఫ్ కాంపౌండింగ్ విద్యార్థుల కోసం బ్యాంకింగ్ ఎసెన్షియల్, డిజిటల్, సైబర్ హైజీన్ పై ప్రాధాన్యత ఇస్తూ ఇది నేషనల్ స్ట్రాటజీ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ యొక్క మొత్తం వ్యూహాత్మక లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది. చిన్నప్పటినుండి క్రమశిక్షణ అలవర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవడమే విద్యార్థుల ముఖ్య లక్షణం. ఇది గ్రాడ్యుయేట్ విద్యార్థుల నుండి విన్నూత ఆలోచనలను కోరడం యువతలో ఆర్థిక అక్షరాస్యతను ప్రచారం చేయడానికి సృజనాత్మక వ్యూహాలపై ఉద్దేశించబడింది బాధ్యతాయుతమైన ఆర్థిక ప్రవర్తన సమాచారంతో కూడిన ఆర్థిక నిర్ణయాలు తీసుకోండి అని యూనియన్ బ్యాంక్ మేనేజర్ విద్యార్థినిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సైబర్ క్రైమ్ ఇనిస్పెక్టర్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శేఖర్ రెడ్డి, వనపర్తి టౌన్ ఎస్ఐ జయన్న దాదాపు 130 మంది విద్యార్థులు, కళాశాల సిబ్బంది, లీడ్ బ్యాంక్ అధికారులు, స్థానిక పోలీసు సిబ్బంది, సైబర్ యోధులు పాల్గొన్నారు.

## తవక్కల్ పాఠశాలలో జాతీయ సైన్స్ డే

**టీ మీడియా, ఫిబ్రవరి 28, రామకృష్ణాపూర్ :**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో సర్ సివి రామన్ జయంతిని మన జాతీయ సైన్స్ డే గా జరుపుకునే సందర్భంగా బుధవారం తవక్కల్ పాఠశాలలో తవక్కల్స్ స్కిల్ డే గా సైన్స్ ఫేర్ ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు దాదాపు అన్ని సబ్జెక్టులలో కలిపి 300 వరకు ప్రాజెక్ట్స్ ,మోడల్స్ ని తయారు చేశారు.సైన్స్ ఫేర్ లో విద్యార్థులు చురుకుగా పాల్గొని,వారు తయారు చేసిన మోడల్స్ ని,ప్రాజెక్ట్స్ ని అక్కడికి వచ్చిన పిల్లల తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై రాజశేఖర్,మునిసిపల్ చైర్మన్ జంగం కళ,వైస్ చైర్మన్ విద్యసాగర్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు,తవక్కల్ విద్యా సంస్థల చైర్మెన్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను, ఉపాధ్యాయుల కృషిని మెచ్చుకున్నారు.

## ఉప ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలి

● జిల్లా ఎన్నికల అధికారి, వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

**టీ మీడియా, ఫిబ్రవరి 28, వనపర్తి బ్యూరో :**




మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులుష తమ వంతు సహకారం అందించాలని వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ కోరారు. బుధవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ సముదాయంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల నిర్వహణ ఏర్పాటు ఓటరు జాబితా పై చర్చించారు. మహబూబ్నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఫిబ్రవరి 26న ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. మార్చి 4న నోటిఫికేషన్ విడుదల అవుతుందని 11వ తేదీ వరకు నామినేషన్లు వేయవచ్చు అన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున నామినేషన్లు ఉపసంహరణ మహబూబ్నగర్ లోనే ఉంటుందని తెలిపారు. 12 నామినేషన్లను పరిశీలన మార్చి 14వ ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మార్చి 28 వ తేదీన ఎన్నికల లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఏప్రిల్ రెండో తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు.వనపర్తి జిల్లాకు సంబంధించిన స్థానిక సంస్థల ప్రతినిధులు ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఇందులో ఓటర్లుగా ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో చిత్రంలో వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ , ఆర్డీవో పద్మావతి, వనపర్తి జిల్లా మీడియా పౌర సమాచార అధికారి సీతారాం నాయక్, వనపర్తి కలెక్టర్ సి సెక్షన్ అధికారి రమేష్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ నాగేందర్, తాసిల్దార్ లు, కలెక్టర్ సీసీ తిలక్ రెడ్డి, వనపర్తి బిఆర్ఎస్ పార్టీ నుండి సయ్యద్ జమీల్, ఎంఐఎం పార్టీ నుండి ఎం ఏ రహీం, బిజెపి నుండి దాసోజు ప్రవీణ్, సిపిఎం నుండి మ%శీ%డ్ల రాజు, టిడిపి పార్టీ నుంచి డ్యార పోగు బాలరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుండి నందిమల్ల త్రినాథ్. ఎస్ వేనా చారి పాల్గొన్నారు.

## జగిత్యాల పీఠం కాంగ్రెస్ దే

### - చైర్ పర్సన్‌గా జ్యోతి ఎన్నిక



**టి మీడియా, ఫిబ్రవరి 28,జగిత్యాల :**గత సంవత్సర కాలంగా ఖాళీగా ఉన్న జగిత్యాల బల్దియా చైర్ పర్సన్ పదవి ఎట్టకేలకు అడువాల జ్యోతికి దక్కింది. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో జ్యోతి ఒక్క ఓటు తేడాతో చైర్ పర్సన్‌గా నియామకం అయ్యారు.దీంతో చైర్ పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకున్న సమిండ్ల వాణికి నిరాశ తప్పలేదు. చైర్‌పర్సన్ ఎన్నిక కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్ కౌన్సిలర్లు జ్యోతి కి మద్దతు తెలిపారు. ఈ ఎన్నికలో జ్యోతి కి 24ఓట్లు రాగా సమిండ్ల వాణి కి 23ఓట్లు వచ్చాయి. అయితే ఒక బిఆర్ఎస్ కౌన్సిలర్ సమావేశానికి హాజరు కాలేదు. చైర్ పర్సన్ ఎన్నికకు ముందు రోజు హై కమాండ్ జారీ చేసిన విప్ ను 12మంది కౌన్సిలర్లు ధిక్కరించారు. దీంతో ఒకే ఒక్క ఓటు తేడాతో జ్యోతికి చైర్ పర్సన్ పదవి దక్కింది.

## రాజీవ్ గాంధీ హత్యకేసు దోషుల్లో ఒకరు మృతి

### రెండేళ్ల క్రితం జైలు నుంచి విడుదల

**టీ మీడియా, ఫిబ్రవరి 28,చెన్నై :**



మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ హత్య కేసులో జీవిత ఖైదును అనుభవించి, జైలు నుంచి విడుదలైన ఆరుగురు దోషుల్లో ఒకడైన శాంతన్ (55) మృతి చెందాడు. అనారోగ్యంతో తమిళనాడులోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి (ఆర్‌జిజిహెచ్)లో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో ప్రాణాలొదిలాడు. శ్రీలంకకు చెందిన శాంతన్ అలియాస్ టి సుతేంద్రరాజాతోపాటు మరో ఐదుగురిని 2022 నవంబర్‌లో సుప్రీంకోర్టు విడుదల చేసింది. అప్పటి నుంచి తిరుచిరాపల్లి సెంట్రల్ జైలు సమీపంలోని ప్రత్యేక శిబిరంలో ఉంటున్నాడు. గత వారం చెన్నైలోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ సంతన్‌ను శ్రీలంకకు తరిమేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటికే కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధపడుతోన్న శాంతన్‌ను తిరుచిరాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 27న ఆసుపత్రిలో చేర్చినట్లు ఆర్‌జిజిహెచ్ డీన్ ఇ తేనిరాజన్ తెలిపారు.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు)లో అతనికి చికిత్స అందించినట్లు తేనిరాజన్ తెలిపారు. వైద్య పరీక్షల్లో సంతాన్‌కు క్రిప్టోజెనిక్ సిర్రోసిస్ అనే వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాత్రి అతని ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో అతను అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారు ఝామున గుండెపోటుకు గురయ్యాడు. సంతన్‌ను కాపాడేందుకు సీపీఆర్ చేసి వెంటిలేటర్ ఉంచినప్పటికీ అతని శరీరం చికిత్సకు స్పందించలేదు. ఈ క్రమంలో 7.50 గంటలకు శాంతన్ మృతి చెందినట్లు వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని శ్రీలంకకు తరలించేందుకు చట్టపరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నట్లు తెలిపారు.1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీపై థను అనే ఎల్‌టీటీఈ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఆ దుర్ఘటనలో రాజీవ్ గాంధీతో పాటు మరో 14 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. హత్యాకుట్రకు నాయకత్వం వహించిన శివరాసన్‌తో పట్టుబడలేదు. ఇక మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యలో ప్రమేయం ఉన్న ఏడుగురికి మొదట కోర్టు మరణశిక్ష విధించింది. దోషుల్లో శాంతన్ కూడా ఒకడు. ఆ తర్వాత అతని శిక్ష జీవిత ఖైదుగా మార్చబడింది. అతను దాదాపు 30 యేళ్లకుపైగా జైలు శిక్ష అనుభవించాడు. ఐదుగురు ఇతర దోషులతో పాటు నవంబర్ 2022లో సుప్రీంకోర్టు విడుదల చేసింది.

## ప్రగతి సాధించడానికి శ్రమనే ఆధారం

### గవర్నర్ తమిళిసై

**టీ మీడియా, ఫిబ్రవరి 28, హైదరాబాద్ :**



తెలంగాణ భాష 'క్లాసిక్ భాష' అని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ భాష మాట్లాడుతున్నప్పుడు చాలా ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. తెలుగు భాష, సంస్కృతి అంతటా వ్యాప్తి చెందాలన్నారు. తెలుగు భాషను ఇతర భాషలు మాట్లాడే ప్రజలందరికీ నేర్పించాలని గవర్నర్ పేర్కొన్నారు. ప్రగతి సాధించడానికి షార్ట్ కట్ ఏమీ ఉండదని, శ్రమనే ఆధారం అని గవర్నర్ తమిళిసై చెప్పారు. రవీంద్ర భారతిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పదహారవ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గన్నారు. పలు కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పట్టాలు అందజేశారు. తెలుగులో మాట్లాడటం నాకు సంతోషంగా ఉంది. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఇలాంటి పండుగ జరగడం ఎంతో ఆనందం, ఇది కన్నుల పండగగా ఉంది' అని తెలంగాణ గవర్నర్ తమిళిసై అన్నారు.'మాతృభాష మన జీవితంలో అవసరం. తెలుగు మాట్లాడే వాళ్లు ప్రపంచ దేశాలలో వివిధ రాష్ట్రాలలో ఉన్నారు. తెలుగు భాషను ఇతర భాషలు మాట్లాడే ప్రజలందరికీ నేర్పించాలి. తక్కువ ఖర్చుతో తెలుగు భాష పుస్తకాలను ప్రచురించి.. సామాన్య ప్రజలు కొని చదివే విధంగా ఉండాలి. నా మాతఅభాష తమిళ్. నేను మా సోదర భాష తెలుగు మాట్లాడడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రగతి సాధించడానికి షార్ట్ కట్ అంటూ ఏమీ ఉండదు, శ్రమనే ఆధారం' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పుకొచ్చారు.



## విద్యార్థిని మృతి

### -ఆదివాసుల ఆగ్రహం

**టి మీడియా, ఫిబ్రవరి 28,ఆదిలాబాద్ :** జిల్లా బేల మండలం మాంగుర్ల గ్రామానికి చెందిన బాలిక తొడసం మహేశ్వరి మామిడి గుడ ఆశ్రమ పాఠశాలలో చదువుతోంది. గత వారం రోజులుగా తీవ్ర జ్వరం, రక్తహీనతతో బాధపడుతున్నా ఆశ్రమ పాఠశాల హెచ్ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించగా పరిస్థితి విషమించడంతో మూడు రోజుల క్రితం అంకోలి ఆసుపత్రిలో చికిత్స అందించారు. బాలిక పరిస్థితి గురించి తల్లిదండ్రులకు వాకబు చేయకుండా ప్రాణాపాయ స్థితిలో ఇంటికి పంపించగా వెంటనే తండ్రి రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు రిమ్స్ ఆస్పత్రికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఆదివాసి చిన్నారి మృతికి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం, ఏటీడీఓ, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ వారిని సస్పెండ్ చేయాలని, బాలిక కుటుంబానికి రూ. 50 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పోస్టుమార్టం అనంతరం బాలికమృతదేహంతో రిమ్స్ ఆస్పత్రి ఎదుట ప్రధాన రోడ్డుపై రెండున్నర గంటలు బైఠాయించడంతో భారీ ఎత్తున వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తింది. జిల్లా కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ రిమ్స్ ఆస్పత్రికి చేరుకొని జరిగిన ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాల హెచ్ఎం సిబ్బంది నిర్లక్ష్య వైఖరి పై వెంటనే విచారణ జరిపించి బాధ్యులైన వారిని సస్పెండ్ చేస్తామని, బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇవ్వడంతో ఆదివాసి సంఘాలు ఆందోళన విరమించాయి.